క్లుప్తంగా

స్వామివారిని దర్శించుకున్న జీవీఎల్ సతీమణి



మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని బీజేపీ సీనియర్ నాయకుడు, యూపీ రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు సతీమణి మైథిలిరావు, కుటుంబ సభ్యులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసిన ఆమె నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు స్వామి వారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శివరామకృష్ణ క్షేత్రానికి రూ.లక్ష విరాళం



కోడూరు: కోడూరులో నూతనంగా నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి అదే గ్రామానికి చెందిన పడమటి శ్రీనివాసరావు-నాగజ్యోతి దంపతులు రూ.లక్ష నగదును విరాళంగా కమిటీ సభ్యులకు శుక్రవారం అందజేశారు. పూర్తి గ్రానైట్‌తో సుమారు రూ.8 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ఆలయానికి తమ వంతు సాయం అందించడం ఆనందంగా ఉందని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు తెలిపారు. కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, బూరగడ్డ హరినాథ్‌బాబు, జూపూడి సుభాష్ చంద్రబోస్, అన్నం శివరామకృష్ణ, పెద్ది బాబురావు, అన్నం సురేంద్ర పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 102 మంది ఎంపిక


బంటుమిల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఎంపీపీ వెలివెల చినబాబు రాష్ట్ర మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్‌తో కలిసి మెగా జాబ్ మేళాను ప్రారంభించి మాట్లాడారు. 10 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని 81 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఇంకా 21 మందిని రెండో ఇంటర్వ్యూకు రావల్సిందిగా సూచించారు. జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ పి. బాబూరావు, కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణకిషోర్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ విక్టర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు ప్రారంభం



గూడూరు: నియోజకవర్గ స్థాయి బాలికల ఆటల పోటీలను శుక్రవారం గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ సంగా మధుసూదనరావు శుక్రవారం ప్రారంభించారు. అండర్-14, 17 విభాగం కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, త్రో బాల్ పోటీలను గూడూరు హైస్కూల్ క్రీడాప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు పర్లం మహాలక్ష్మయ్య నాయుడు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొల్లు వాసు, హెచ్ఎం డి.పుష్పలత, నియోజకవర్గ స్థాయి క్రీడల సమన్వయకర్త చింతా మురళి, పీడీలు మత్తి అరుణ, చిలుకోటి రాజేష్ పాల్గొన్నారు.

పెన్షనర్ల వితరణ



మచిలీపట్నంటౌన్: 29వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్ సామాజిక పింఛనుదారు జక్కుల మోహనరావు ఇటీవల మృతిచెందాడు. డివిజన్‌లోని పింఛనుదారులు ఒక్కొక్కరు రూ.100 చొప్పున సేకరించిన రూ. 41,700లను శుక్రవారం మోహనరావు భార్య జ్యోతికి కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ యర్రా శ్రీనివాసకుమార్ అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోనేరుసెంటర్: మంగినపూడిలోని 33 కేవీ ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ ఎం. భాస్కర్ శుక్రవారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని తాళ్లపాలెం, కానూరు, పెదపట్నం, గోకవరం, సిరివెళ్లపాలెం, మంగినపూడి, తపసిపూడి గ్రామాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

వైద్యసేవల్లో విప్లవాత్మక మార్పులు

- జగనన్న సురక్షతో చేరువైన వైద్యం
- పేదలందరికీ వారి ప్రాంతంలోనే ఉచిత వైద్య సేవలు
- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



సురక్ష మందుల కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: రాష్ట్రంలోని పేదలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వైద్యసేవల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తోందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక పంచాయతీ పరిధిలోని రెండో సచివాలయంలో శుక్రవారం ఆయన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం వల్ల పేదలందరికీ వారి ప్రాంతంలోనే ఉచితంగా వైద్య సేవలు అందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ రామకృష్ణ, మండల కో–ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాషా, ఎంపీటీసీ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

510 మందికి వైద్య పరీక్షలు

గూడూరు: గూడూరు మండలం కంకటావ గ్రామ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 510 మందికి వైద్య సేవలు అందించారు. మధుమేహంతో బాధపడుతున్న 290 మందికి, రక్తపోటుతో బాధపడుతున్న 200 మందికి, బాలింతలు 10 మందికి, గర్భిణులు 10 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. నేత్ర విభాగంలో 110 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, బందరు ఆర్డీఓ నారాయణరెడ్డి, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వైద్య సేవలు..

పెడన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ వైద్యసేవలను చేరువ చేసి పేదలను ఆరోగ్యవంతులుగా చేస్తున్నారని మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. 920 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 151 మందికి కంటి పరీక్షలు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, పట్టణ కన్వీనర్ మల్లి, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ మహేంద్ర, అధికారులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల వద్దకే వైద్య సేవలు

మోపిదేవి: ప్రజల ముంగిటకే వైద్య సేవలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మోపిదేవి జెడ్పీ పాఠశాల ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎండీ జనరల్ డాక్టర్ ప్రవీణ్ రాఘవ, కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎస్. అనూష, డాక్టర్ పరసా అనూష, గైనకాలజిస్టు డాక్టర్ ఎం. శ్రావణి, పీహెచ్‌సీ వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్‌లు నందిగం మేరీరాణి, గరికిపాటి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

- నందిగామలో పెడన పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 736 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఏడుగురికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి సిఫార్సు చేశారు. డాక్టర్లు ప్రదీప్‌కుమార్, మీనాదేవి, సౌజన్య, జ్యోతి, ఇబ్రహీంలు వైద్య పరీక్షలు నిర్వహించారు. అధికారులు, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నాచుగుంటలో..

నాచుగుంట(నాగాయలంక): ఎదురుమొండి నాచుగుంట సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష సేవల శిబిరం ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. సర్వేలో గుర్తించిన 466 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ఈఓపీఆర్డీ కె.అప్పల నరసమ్మ మండలంలోని పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రాజేశ్వరరావు, డాక్టర్ ఫాతిమున్నీసా, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విశ్వనాథపల్లిలో..

కోడూరు: విశ్వనాథపల్లి సచివాలయం పరిధిలో శుక్రవారం సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి మాట్లాడారు. శిబిరంలో పాల్గొన్న 490 మందికి వైద్యనిపుణులు జి.జయచంద్ర, గంగాధర్, తారకేశవరావు, మానస, ఇంద్రకుమార్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

గరిశపూడిలో..

కృత్తివెన్ను: గరిశపూడి పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ పాల్గొని వైద్య పరీక్షల తీరును పరిశీలించి రోగులతో మాట్లాడారు. శిబిరానికి హాజరైన వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గంగాధర్, మండల కన్వీనర్ వెంకట్రాజు, జేసీఎస్ మండల కన్వీనర్ బాపూజీ, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఎంపీడీఓ పిచ్చిబాబు, వైద్యులు సందీప్, హీర, సర్పంచ్ నాగార్జున, ఎంపీటీసీ పోతురాజు పాల్గొన్నారు.

ఒక్క ట్యాబ్లెట్ కూడా కొనాల్సిన అవసరం లేదు ..

లక్ష్మీపురం(చల్లపల్లి): పేదలు ఒక్క టాబ్లెట్ కూడా కొనాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ వైద్యశాలల్లో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం లక్ష్మీపురం గ్రామ సచివాలయం-1 పరిధిలోని ఎంపీపీ స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి రోగులతో మాట్లాడారు. గతంలో ఎన్నడూలేని విధంగా ప్రభుత్వ వైద్యరంగాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి చేశారన్నారు. శిబిరంలో 520 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానా, జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి, ఎంపీడీఓ చేకు చినరాట్నాలు, సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ శీరం వెంకట సత్యనారాయణ, ఎంపీటీసీ నూకల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పెడనలో మహిళకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



గరిశపూడిలో కే షీట్‌ను అందిస్తున్న జోగి రాజీవ్



పోతిరెడ్డిపాలెంలో వృద్ధులకు నేత్ర వైద్య పరీక్షలు

ఆరోగ్యమే మహాభాగ్యం..

కోనేరుసెంటర్: ఆరోగ్యమే మహాభాగ్యమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. పోతిరెడ్డిపాలెం సచివాలయంలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కిట్టు పాల్గొని మాట్లాడారు. శిబిరంలో పాల్గొన్న వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, ఎంపీడీఓ బాలకృష్ణ, తహసీల్దార్ శ్రీవిద్య, పోతిరెడ్డిపాలెం మాజీ సర్పంచ్ మేక లవకుమార్, కేడీసీసీబీ డైరెక్టర్ బాల జేసు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో గ్రామ స్వరాజ్యం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

రేమాలవారిపాలెం(నాగాయలంక): గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సాకారమవుతోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రేమాలవారిపాలెం సచివాలయం పరిధిలోని పేర్లవానిలంక, దేగలవారిపాలెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. రెండు గ్రామాల్లో 366 గృహాలను ఎమ్మెల్యే సందర్శించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఫ్యామిలీ డాక్టర్ వంటి పలు వ్యవస్థలను గ్రామస్తులకు అందుబాటులోకి తెచ్చారని వివరించారు. జగనన్న నిరంతరం పేద ప్రజల అభ్యున్నతికి పరితపిస్తున్నారని, ఆయనకు అండగా నిలిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తారని చెప్పారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, ఎంపీపీ భోగాది రాఘవరాణి, రేమాలవారిపాలెం సర్పంచ్ చోడిశెట్టి బుజ్జమ్మ, టి.కొత్తపాలెం సర్పంచ్ బండ్రెడ్డి శివపార్వతి, ఎంపీటీసీ పుట్టి స్వరూపరాణి, మండల కన్వీనర్ భోగాది శేషగిరిరావు, నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ మద్ది వెంకట నారాయణ (చిన్నారి), అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



బ్రోచర్ అందజేసి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

నవరత్నాల లబ్ధిదారులకు సన్మానం

నాగాయలంక: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన నవరత్నాల పథకాలతో తాము లబ్ధిపొంది సంతోషంగా జీవిస్తున్నామని గ్రామానికి చెందిన గడ్డం దేవచంద్రరాజు, ప్రభావతి దంపతులు ఎమ్మెల్యేకు తెలిపారు. కృతజ్ఞతగా మిమ్మల్ని సన్మానిస్తామని వారు ఎమ్మెల్యేను కోరగా.. ఎమ్మెల్యే సున్నితంగా వారిని వారించారు. అనంతరం లబ్ధిదారులైన దేవచంద్రరాజు, ప్రభావతి దంపతులను ఎమ్మెల్యే సన్మానించి మాట్లాడారు. సన్మానాలకు తాను దూరమని, మీ సంతోషమే మా ప్రభుత్వానికి శ్రీరామరక్ష అని వారిని అభినందించారు.

గ్రామ వనరులపై అవగాహన అవసరం



మోపిదేవి: గ్రామంలో వనరులు, రాబడిపై గ్రామస్తులు అవగాహన కలిగి ఉండాలని ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ విశ్వవిద్యాలయం, సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు అన్నారు. గ్రామంలో వనరులపై అవగాహన కార్యక్రమం మోపిదేవి ఆదర్శ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతుల ఆదాయం పెరగాలంటే వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ, న్యూట్రీ గార్డెన్, కుటీర పరిశ్రమలపై కూడా గ్రామస్తులు దృష్టి సారించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని యార్లగడ్డ స్వరూపరాణి, ఉపాధ్యాయులు, కేకే ఘంటసాల ఎస్ఎంఎస్ కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి, ఆదర్శ రైతు జొన్నలగడ్డ పిచ్చేశ్వరరావు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కానూరులో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

కోనేరుసెంటర్: గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. కానూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన రూ. 20 లక్షలతో వంతెన నిర్మాణ పనులకు శుక్రవారం పేర్ని కిట్టు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తెలుసుకున్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. ఈ వంతెన నిర్మాణం జరగడం ద్వారా జీ కానూరు శ్మశానవాటికకు వెళ్లేందుకు గ్రామస్తులకు మార్గం సుగమం అవుతుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామ ఇన్‌చార్జి చెక్క ఏడుకొండలు, ఉప సర్పంచి గోపు మురళి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గణపాబత్తుల చూడామణి, పంచాయతీ కార్యదర్శి పరస శ్రీహరిరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



వంతెన పనులకు శంకుస్థాపన చేస్తున్న పేర్ని కిట్టు

జాతీయ రహదారిపై పైప్‌లైన్ లీకేజీ పరిశీలన

గూడూరు: మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై గూడూరు సెంటర్‌లో ఏర్పడిన తాగునీటి పైప్‌లైన్ లీకేజీని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులు పరిశీలించారు. జాతీయ రహదరిపై వాహనాల రాకపోకలతో గూడూరు నుంచి పటాన్‌పేటకు తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్ ధ్వంసమైంది. తాగునీటి సరఫరా సమయంలో నీరు వృథాగా పోతోంది. రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సర్పంచి లింగం సులోచనారాణి పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టాలనే యోచనతో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులతో సంప్రదించారు. దీంతో శుక్రవారం లీకేజీ ప్రాంతాలను నేషనల్ హైవే అథారిటీ ఇంజినీరింగ్ అధికారులు అనిల్, అభయ్, ఎరైన్‌లు పరిశీలించి మాట్లాడారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా మరమ్మత్తులు చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శి టీవీవీ భాస్కరరావు, లింగం విజయ్‌కుమార్, సచివాలయం ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

13న సైకిల్‌స్టాండ్, క్యాంటీన్ నిర్వహణకు వేలం

మచిలీపట్నంటౌన్: నగరంలోని రైతుబజారులో సైకిల్ స్టాండ్, క్యాంటీన్ నిర్వహించుకునేందుకు ఈ నెల 13వ తేదీన వేలం నిర్వహిస్తామని రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ ఎస్. అమీర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైకిల్‌స్టాండ్‌కు ఒక సంవత్సరం, క్యాంటీన్‌కు రెండు సంవత్సరాల కాలపరిమితికి వేలం నిర్వహిస్తామన్నారు. 13వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక డిస్ట్రిక్ట్ అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ కార్యాలయంలో బహిరంగ వేలం జరుగుతుందన్నారు. వేలానికి సంబంధించిన షరతులు, దరఖాస్తు ఫారాలు రైతుబజారులోని తన కార్యాలయంలో లభిస్తాయన్నారు. ఆసక్తిగల వారు రూ. 25 వేలు డిపాజిట్‌గా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రైతుబజార్స్, గుంటూరు పేరు మీద డీడీ తీసి దరఖాస్తు ఫారాన్ని పొందవచ్చునన్నారు. 12వ తేదీ సాయంత్రం 5గంటల లోగా దరఖాస్తు ఫారాలను అందజేయాలన్నారు.

అన్నసమారాధన

గుడివాడ టౌన్: స్థానిక పుల్లలపాడు వంతెన వద్ద బాలగణపతి స్వామి దేవస్థానం నిర్వాహకులు శుక్రవారం భారీ అన్నసమారాధన జరిపారు. గణపతి నవరాత్రి మహోత్సవాలు విజయవంతంగా ముగిసినందున శాంతి నిమిత్తం ఈ అన్నసమారాధన చేపట్టామన్నారు. తొలుత అన్నదాన కుంభాన్ని స్వామి వారికి సమర్పించారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు రియాజ్ హుస్సేన్‌కు అవార్డు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరానికి చెందిన వైఎస్సార్ సీపీ టీచర్స్ యూనియన్ సీనియర్ నాయకుడు, ఉర్దూ విశ్రాంత ఉపాధ్యాయుడు మీర్జా రియాజ్ హుస్సేన్ ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ అవార్డుకు ఎంపికయ్యారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని 20 మందికి ఆ సంస్థ అవార్డులను ప్రకటించింది. రియాజ్ హుస్సేన్ ఉర్దూ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. అవార్డును విజయవాడ లబ్బీపేటలోని దర్గ్‌గా ఈ ఇస్లామిక్ హైస్కూల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో ఆయనకు అందజేయనున్నారు. రియాజ్ హుస్సేన్‌ను పలువురు అభినందించారు.

కోడికత్తులు కలిగిన వ్యక్తి బైండోవర్

పెడన: మండల పరిధిలోని జింజేరు గ్రామానికి చెందిన కట్టా నాగశివాజీ ఇంట్లో సోదాలు నిర్వహించగా కోడి కత్తులు కలిగి ఉండటంతో అతడిని అదుపులోకి తీసుకుని బైండోవర్ చేశామని పెడన ఎస్ఐ రవిచంద్రకుమార్ తెలిపారు. శివాజీ ఇంట్లో గురువారం రాత్రి పోలీసులు తనిఖీ చేయగా 20 కోడి కత్తులు లభించాయన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని శుక్రవారం పెడన తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని చెప్పారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక



పెడన: పెడన నియోజకవర్గ స్థాయిలో జరిగిన వివిధ పోటీల్లో బల్లిపర్రు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు అండర్-14, 17 విభాగాలలో త్రోబాల్, కబడ్డీలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎస్. రూతమ్మ శుక్రవారం తెలిపారు. గూడూరు జెడ్పీ హెచ్ఎస్‌లో జరిగిన పోటీల్లో అండర్ -14 త్రోబాల్‌లో కె. అక్షయ్య, డి మమతశ్రీ, వి. రాజ్యలక్ష్మి, వి. రాజశ్రీ, డి. సింధు, ఎ. లహరి, డి. అక్షయ్య, సీహెచ్ యమున ఎంపికయ్యారని చెప్పారు. అండర్-17 విభాగం త్రోబాల్‌లో సీహెచ్ రేణుకా, పీజీవీ అలేఖ్య, కె. సుమతి, కె. గంగాభవానీ, కె. జెస్సీ ఎంపికయ్యారన్నారు. అండర్-17 కబడ్డీలో బి. జెస్సికా ఎంపికై ందని చెప్పారు. విద్యార్థులను అభినందించారు.

పారిశుద్ధ్యం నిర్వహణలో అలసత్వాన్ని సహించం

మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: నగరంలో పారిశుద్ధ్యం నిర్వహణలో ఉద్యోగులు, కార్మికులు అలసత్వాన్ని ప్రదర్శిస్తే సహించేది లేదని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)తో కలిసి ఆమె 4వ డివిజన్‌లో శుక్రవారం పర్యటించారు. పలు ప్రాంతాల్లో ఉన్న అపరిశుభ్ర పరిస్థితులను, పేరుకుపోయిన చెత్త, మట్టిదిబ్బలను చూసి పారిశుద్ధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, మట్టిదిబ్బలను తొలగించాలని, డ్రెయిన్లలో పూడిక తీయాలని సిబ్బందికి సూచించారు. డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, కమిషనర్ జి. చంద్రయ్య, డీఈ సతీష్‌చంద్ర, కార్పొరేటర్ మేకల సుబ్బన్న, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ వడ్డి రాఘవ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుద్ధ్యాన్ని పరిశీలిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, పేర్ని కిట్టు తదితరులు

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

కోడూరు: వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో ముందస్తు చర్యల్లో భాగంగా కోడూరు పంచాయతీలో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం పంచాయతీ పరిధిలోని వీవర్స్ కాలనీ, ఈబీసీ కాలనీ, గాయత్రి కాలనీ, సంతమార్కెట్, యర్రారెడ్డివారిపాలెం, ఇస్మాయిల్‌బేగ్ పేట ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రహదారులకు ఇరువైపులా నిల్వ ఉన్న మురుగు నీటిని తొలగించి బ్లీచింగ్ చల్లారు. డ్రెయినేజీల్లో పేరుకుపోయిన సిల్ట్, వ్యర్థాలను తొలగించారు. ప్రస్తుతం జ్వరాల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజల ఆర్యోగం దృష్ట్యా పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నామని సర్పంచి వెన్నా షైనీ తెలిపారు. ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.

- మచిలీపట్నంటౌన్: నగరంలోని 46వ డివిజన్‌లో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రెయిన్లలో పూడికతీత పనులతో పాటు రోడ్లు, రోడ్డు మార్జిన్లను శుభ్రం చేశారు. రోడ్లపై, డ్రెయిన్ల వద్ద చిత్తడి ప్రాంతాల్లో బ్లీచింగ్, సున్నం చల్లారు. పల్లపు ప్రాంతాల్లో ఉన్న నీరు పారేందుకు జేసీబీ సాయంతో డ్రెయిన్లను తవ్వారు. పనులను కార్పొరేటర్ భోగాది సాయిబాబు, కో-ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి పర్యవేక్షించారు.



చెత్త తొలగించి బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

ప్రపంచ సెరిబ్రల్ పాల్సి దినోత్సవం

ఎలకుర్రు(పామర్రు): గ్రామంలోని కాశీనాథుని దుర్గాంబ బుచ్చయ్య ట్రస్టులో శుక్రవారం ప్రపంచ సెరిబ్రల్ పాల్సి దినోత్సవం (మస్తిష్క పక్షవాతం) నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ సురేష్ చంద్రారెడ్డి మాట్లాడుతూ చిన్నారులలో అంగవైకల్యం రావడానికి బిడ్డ తల్లి గర్భంతో ఉన్నప్పుడు తల్లికి ఉన్న ఇన్ఫెక్షన్ శిశువుకు సంక్రమించి ప్రీమెచ్యూర్ బేబీస్ జన్మిస్తారన్నారు. కాన్పు కష్టమైనప్పుడు జన్మించిన బిడ్డకు హైపోగ్లైసేమియాకు గురికావడం, మెదడు పెరుగుదలలో నిర్మాణపరమైన లోపాలు రావడం జరుగుతుందని తెలిపారు. దీని నివారణకు గర్భిణులు అందరూ వ్యాధి నిరోధక టీకాల ద్వారా కొన్ని వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని చెప్పారు. అనంతరం దివ్యాంగులైన చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ట్రస్టు నిర్వాహకులు కాశీనాథుని నాగేశ్వరరావు, సిబ్బంది వసుంధర, చిన్నారులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దివ్యాంగులు

- గుడివాడ టౌన్: స్థానిక కేబీఆర్ గవర్నమెంట్ ఐటీఐలో నేషనల్ అప్రెంటీస్ మేళా ఈనెల 9న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి. హరిధర్మేంద్ర శుక్ర వారం తెలిపారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఐటీఐ పూర్తిచేసిన అన్ని ట్రేడుల విద్యార్థులు అర్హులన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ మేళాను వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 8297574757ను సంప్రదించాలని కోరారు.